# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పి.వి.నరసింహ్ రావు సాహసోపేతమైన ఆర్థిక సంస్కరణలు అమలు చేసి దేశ ప్రగతికి బాటలు వేసారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలు సేవలు ప్రారంభించే విధంగా అధికారులు చొరవ చూపాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించారు.
- ❖ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వైద్యరంగంలో సంస్కరణలు తీసుకువచ్చామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- ❖ నదుల అనుసంధానంతో రాష్ట్రంలో కరవు నివారించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.

===========================

పూర్వ ప్రధానమంత్రి పి.వి.నరసింహ్ రావు సాహసోపేతమైన ఆర్థిక సంస్కరణలు తీసుకుని భారతదేశ ప్రగతికి బాటలు వేసారని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ రోజ ఢిల్లీ పర్యటనలో భాగంగా మూర్తి మార్గ్-3లో నిర్వహించిన పీ.వీ.నరసింహ్‌రావు సంస్మరణ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మైనారిటీ ప్రభుత్వాన్ని నడుపుతూ.. సాహసోపేతమైన నిర్ణయాలను పి.వి.నరసింహ్ రావు తీసుకుని అమలు చేసారన్నారు. నేడు మనం ఈ సంస్కరణల ఫలితాలను అనుభవిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 40 సెకన్లు)

===========================

రానున్న నాలుగేళ్లలో ఐటి, ఎలక్ట్రానిక్స్, డాటా సెంటర్స్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జిసిసి) ద్వారా 10 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా అధికార యంత్రాంగం పని చేయాలని రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో ఈ రోజు ఆయన ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో ఈ రంగాలలో ఇప్పటి వరకు 95 ప్రముఖ సంస్థలు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు

పెట్టేందుకు ముందుకు వచ్చాయని, ఆ సంస్థల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. టిసిఎస్, కాగ్నిజెంట్ సంస్థలకు విశాఖలో ఇప్పటికే భూకేటాయింపులు పూర్తి చేశామని, సాధ్యమైనంత త్వరగా ఈ సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు.

==========================

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వైద్యరంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చామని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విశాఖపట్నంలో మానసిక ఆసుపత్రి ఆవరణలో 30 కోట్ల రూపాయల నిధులతో నిర్మించిన సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ భవనాలు, అకడమిక్ బ్లాక్‌ను ఆయన ప్రారంభించారు. ఆ త్వరాత నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ లో భాగంగా కోటీ 38 లక్షల రూపాయల వ్యయంతో పెదవాల్తేరు వద్ద నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను మంత్రి ప్రారంభించారు.

అనంతరం మధ్యాహ్నం గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన 40 పడకల ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం, అడ్వాన్స్‌డ్ ఆపరేషన్ థియేటర్ల కాంప్లెక్స్‌ను మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ను సాధించడానికి ప్రైవేట్ ఆసుపత్రుల సహకారం కీలకమని పేర్కొన్నారు. ఏటా కుటుంబానికి 25 లక్షల రూపాయల వరకు ఆరోగ్య బీమా కవరేజిని అందించే ఆరోగ్య బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనుందని మంత్రి ప్రకటించారు. కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించడానికి డా.ఎన్.టి.ఆర్ వైద్య సేవ పథకంలో కోటీ 6 లక్షల కుటుంబాల తరపున ఆరోగ్య బీమా ప్రీమియంను ప్రభుత్వం చెల్లిస్తోందని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

==========================

తోతాపురి మామిడి రైతులను ఆదుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం 4 రూపాయలను రాయితీ రూపంలో రైతులకు అందించనున్న నేపథ్యంలో ఆర్థిక సహాయం దుర్వినియోగం కాకుండా చూడాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా సచివాలయం నుండి మండల వ్యవసాయ, ఉద్యానవన అధికారులతో కలెక్టర్ దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులు సరైన విధానంలో రాయితీ అందే విధంగా మండల అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని రైతుల నుండి గుజ్జు పరిశ్రమలకు అందించడం జరిగిందని చెప్పారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల నుండి మామిడి సేకరణ జరుగుతోందని, మరో 15 రోజులు పాటు ఇది కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు సేకరించిన మామిడికి రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న 4 రూపాయల సబ్సిడీ మొత్తం 120 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

విరామం

==========================

ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి ఆఖరి ఎకరాకు సైతం సాగునీటిని అందించాలనే లక్ష్యంతో వాటర్ మేనేజ్మెంట్ ను అమలు చేస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రఖ్యాత ఇంజనీర్ డాక్టర్ కె.ఎల్.రావు 124వ జయంతి పురస్కరించుకుని విజయవాడ దుర్గా ఘాట్ లోని ఇరిగేషన్ మోడల్ గెస్ట్ హౌస్ వద్ద డాక్టర్. కె.ఎల్.రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సాగునీటి రంగంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. హీరాకుడ్, శ్రీశైలం, నాగార్జున సాగర్ వంటి అనేక బహుళార్ధక సాధక ప్రాజెక్టుల రూపకల్పనలో కె.ఎల్.రావు ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో కరవు నివారించే ప్రయత్నం ముఖ్యమంత్రి చేస్తున్నారని చెప్పారు. పోలవరాన్ని పూర్తి చేసి గోదావరి జలాలు ఉత్తరాంధ్ర, రాయలసీమకు అందిస్తామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

==========================

రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఈ రోజు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను కలిసి, నియోజక వర్గ పరిధిలోని రైల్వేకి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు. రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషన్ అభివృద్ధికి 271 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి 6 నెలలు అయిందని, ఇంకా టెండర్లు పిలవలేదని జీఎంకి వివరించారు. వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని, 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో రైల్వే స్టేషన్ అభివృద్ధి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె కోరారు. గోదావరి స్టేషన్, కొవ్వూరు స్టేషన్లలో టాయ్ లెట్లు వంటి సౌకర్యాలు మెరుగుపరచాలని, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పుష్కరాల ప్రారంభానికి ముందుగానే పనులు పూర్తి చేయాలని పురందేశ్వరి కోరారు.

==========================

మహిళలను ఆర్థికంగా శక్తివంతులను చేసి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి లైవ్లీ హుడ్స్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ యాక్సిలరేషన్ (LEAP) కార్యక్రమాన్ని తాడేపల్లిలో ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి LEAP కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 30 వేల మందికి పైగా మహిళా వ్యాపారవేత్తలను తయారు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల నుంచి రుణం తీసుకుని చిన్న వ్యాపార సంస్థలను నెలకొల్పి అంచెలంచెలుగా కోటి రూపాయల టర్నోవర్ సాధించే సంస్థలుగా రూపాంతరం చెందేలా వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

==========================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజులు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది.. మరికొన్ని చోట్ల వేడి, తేమతో కూడిన అసౌకర్యమైన వాతావరణం ఉంటుందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

==========================

==========================